ఇచ్చిన హామీని అమలు చేయాలి



పవన్‌కల్యాణ్ అంబాజీపేట రోడ్ షోలో ఎన్నో హామీలు ఇచ్చారు. దీంతో పాటు నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు సైతం హామీల వర్షం కురిపించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేసే బాధ్యత కూటమి నేతలదే తీసుకోవాలి. ఇది మంచి ప్రభుత్వం అంటూ సంబరాలు చేసుకుంటున్నారు. వంద రోజుల్లో ఏం చేశారని సంబరాలు చేసుకుంటున్నారో ఎవరికీ అర్థం కావడం లేదు. సూపర్ సిక్స్ పథకాలను మరుగున పెట్టేశారు. వాటి ప్రస్తావనే తీసుకురావడం లేదు.

– దొమ్మేటి సత్యమోహన్, సొసైటీ మాజీ అధ్యక్షులు, అంబాజీపేట

కూటమి నేతలు హామీని నేరవేర్చాలి



వరదల సమయంలో ముక్తేశ్వరం–అయినవిల్లిలంక ఎదురుబిడెం వద్ద కాజ్‌వే ముంపుబారిన పడడంతో మూడు లంక గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాజ్‌వేపై వంతెన నిర్మాణంతో లంక ప్రజలకు ఇబ్బందులు తొలగుతాయి. ఈ ఏడాది రెండు దఫాలు వచ్చిన వరదలకు కాజేవే ముంపుబారిన పడింది. తాము అధికారంలోకి వస్తే కాజేవేను నిర్మిస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి వందరోజులు అయింది. దీని పై ఏ విధమైన కార్యాచరణ లేదు.

– జగదం శేషు, అయినవిల్లిలంక

సాగునీరు అందించాలి



కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే అప్పనపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నాలుగు తీర గ్రామాలకు సాగునీరు అందిస్తామని కూటమి నేతలు ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారు. దీనికి అనుగుణంగా అప్పనపల్లి ఎత్తిపోతల పథకం వెంటనే చేపట్టే విధంగా కార్యాచరణ చేపట్టాలి. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎన్నికల ప్రచారంలో దీనిపై స్పష్టమైన హామీ ఇచ్చారు. దాన్ని అమలు చేసే బాధ్యతను అతనే తీసుకోవాలి. ప్రచారం తప్ప కూటమి వంద రోజుల్లో సాధించింది శూన్యం.

– లంకే ఏసుబాబు, అప్పనపల్లి

ఉత్తుత్తి హామీలే..

- హామీలే తప్ప అమలు శూన్యం..
- వంద రోజుల పాలనపై పెదవి విరుపు



పడవలపై ఎదురు బిడెం కాజ్‌వే దాటుతున్న ప్రజలు (ఫైల్)



అప్పనపల్లిలో గోదావరి నదిలో పడిపోయిన కొబ్బరిచెట్టు

మామిడికుదురు: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టి వంద రోజులు పూర్తి అయింది. అప్పటి కూటమి నేతలు, ప్రస్తుత ప్రజా ప్రతినిధులు శత దినోత్సవ పాలనలో హామీల అమలు దిశగా చేసింది శూన్యమన్న విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. ప్రచార హంగామా, ఆర్భాటాల కూటమి నేతల ఉత్తుత్తి హామీలే తప్ప ప్రణాళిక ప్రకారం నియోజకవర్గాల అభివృద్ధికి ముందుకు వెళ్తున్న దాఖలాలు ఎక్కడా కనరావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల్లో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఓసారి పరిశీలిద్దాం.

పి.గన్నవరం నియోజకవర్గంలో హామీలివీ..

అంబాజీపేటలో కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో పాటు యువతకు, కొబ్బరి రైతులకు ఆర్థిక స్వావలంబన కల్పించే దిశగా కార్యాచరణ చేపడతామన్నారు. పి.గన్నవరంలో ఫైర్ స్టేషన్ నిర్మాణానికి ఆమోదం లభించినా సిబ్బందిని నియమించలేదని, అధికారం చేపట్టిన వెంటనే ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. పి.గన్నవరం నియోజకవర్గంలో తీవ్రంగా ఉన్న నదీకోత నివారణకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. అప్పనపల్లి ఎత్తిపోతల **పథకం ద్వారా లంక గ్రామాలకు సాగు నీరు అందిస్తామన్నారు. ఏటా గోదావరి వరదల వల్ల ముంపు సమస్య ఎదుర్కొంటున్న లంక గ్రామాల ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు అవసరమైన చోట్ల** వంతెనలు నిర్మిస్తామన్నారు. అయినవిల్లి మండలం ముక్తేశ్వరంలో ఎదురు బిడిం కాజ్‌వేను ఆధునీకరిస్తామని చెప్పారు.

రాజోలు నియోజకవర్గంలో హామీలు ఇవీ..

వశిష్ట నదిపై రామేశ్వరం–రాజుల్లంక బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. గోదావరి వరదల సమయంలో ఒక మాదిరి వరదకే రోడ్లు ముంపుబారిన పడుతున్నాయని, ముంపునకు గురికాని విధంగా ఎత్తుగా రోడ్లు నిర్మిస్తామన్నారు. రాజోలు నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేసి, తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ఉపాధి కోసం విదేశాలకు ఎక్కువగా వలసలు వెళ్తున్నారని, వాటిని అరికట్టి అటువంటి వారికి నియోజకవర్గంలోనే ఉపాధి కల్పిస్తామన్నారు. రోడ్లు, పంట కాలువలు, డ్రైనేజీల స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయని, ఆక్రమణల వల్ల ప్రజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటామన్నారు.

కొత్తపేట నియోజకవర్గంలో హామీలు...

కొత్తపేట నియోజకవర్గంలోని ఆత్రేయపురం మండలంలో ఎంతో కాలం నుంచి అపరిష్కృతంగా ఉన్న లొల్ల లాకుల ఆధునీకరణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆలమూరు మండలం కొత్తూరు–వెదురుమూడి రోడ్డును పక్కాగా తీర్చిదిద్దుతామని భరోసా ఇచ్చారు.

కోత నుంచి విముక్తి కలిగించండి



గోదావరి కోత ఎంతో కాలం నుంచి మమ్మల్ని వేధిస్తోంది. అప్పనపల్లి గ్రామంలో మా నివాస గృహాలను కోత సమీపించింది. అనుక్షణం బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నాం. కోత నుంచి విముక్తి కలిగిస్తారని ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నాం. గత ఎన్నికల సమయంలో మీరు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటారని ఆశిస్తున్నాం. ఈ దిశగా వెంటనే చర్యలు తీసుకుని మా చిరకాల సమస్యను పరిష్కరించండి.

– యేడిద వెంకటలక్ష్మి, అప్పనపల్లి

తీర గ్రామాల ఇబ్బందులు తొలగించాలి



తాము అధికారంలోకి వస్తే లంక గ్రామాల ప్రజల ఇబ్బందులు తొలగిస్తామని ఎన్నికల్లో కూటమి నేతలు హామీ ఇచ్చారు. దీంతో ప్రజలు కూటమి నేతల మాటలు నమ్మి ఎన్నికల్లో ఓట్లు వేశారు. మూడు గ్రామాలకు చెందిన 30 వేల మంది ఏటా గోదావరి వరదలకు ఇబ్బందులు పడుతున్నారు. కాజ్‌వే స్థానే వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలి. ఆ దిశగా ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలి.

– మిందగుదుటి రాంబాబు, వీరవల్లిపాలెం

ప్రధాన సమస్యలు పరిష్కరించాలి



రాజకీయ లబ్ధి కోసం ఎన్నికల సమయంలో కూటమి నేతలు ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయినా ఇంత వరకు ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. ఇచ్చిన ప్రతి ఒక్క హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయాలి. పి.గన్నవరం నియోజకవర్గంలో సుదీర్ఘంగా పరిష్కారానికి నోచుకోని గోదావరి కోత నివారణ, ఫైర్ స్టేషన్ ఏర్పాటు తదితర ప్రధాన సమస్యలను పరిష్కరించాలి.

– సరెళ్ల అప్పారావు, ముంగండ

బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలి



వశిష్ట నదిపై రామేశ్వరం–రామరాజులంక బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేస్తామని ఎన్నికల్లో కూటమి నాయకులు ప్రజలను మభ్యపెట్టారు. రాజోలు నియోజకవర్గంలో ఇంటింటికీ తాగునీరు అందిస్తామన్నారు. పాలనా పగ్గాలు చేపట్టి 100 రోజులు పూర్తయింది. కానీ నియోజకవర్గంలో చేస్తామని చెప్పిన హామీలతో పాటు సూపర్ సిక్స్ పథకాలను కూడా అమలు కూటమి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి.

– పాటి శివకుమార్

క్లుప్తంగా

మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలి

ఆలమూరు: మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని మడికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ ఐ.తనూజ అన్నారు. మండలంలోని మడికిలో డీఆర్డీఏ ఏపీఎం ఎం.ధనరాజు ఆధ్వర్యంలో స్థానిక గ్రామ పెద్దల సమక్షంలో శుక్రవారం విమెన్ లీడ్ ఎంటర్‌ప్రెన్యూర్స్ సమావేశం జరిగింది. రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న డ్వాక్రా మహిళలతో అవగాహన సదస్సు జరిగింది. మహిళలు చేపట్టే వివిధ వ్యాపార కార్యకలాపాలకు పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఈ, ముద్ర లోన్, విశ్వకర్మ, స్వయం సిద్ధ, నారీశక్తి, నారీభేరి, ఎంఎస్ఎంఈ, స్టాండప్ ఇండియా, స్వయం సమృద్ధి తదితర స్కీముల ద్వారా వ్యాపార నిర్వాహకులు తాము నిర్వహించుకునే వ్యాపారాన్ని బట్టి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించడం జరుగుతుందని ఏపీఎం ధనరాజు తెలిపారు. పీఎం ఎఫ్ఎంఈ, పీఎంఈజీపీ స్కీంల ద్వారా సబ్సిడీ రుణాలు పొందే అవకాశం ఉన్నందున అర్హులందరూ సమీప యానిమేటర్ల సహకారంతో ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలని సీసీ కె.భీమరాజు పేర్కొన్నారు. ఎన్డీఏ కూటమి నాయకులు దొండపాటి సుబ్బరాజు, కొత్తపల్లి కృష్ణ, కొత్తపల్లి నగేష్, అడ్డాల సత్యనారాయణ పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించాలి



కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో స్థానిక అధికారులతో సమీక్షిస్తున్న ఐజీ అశోక్‌కుమార్

కొత్తపేట: పోలీస్‌స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులు, కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఐజీ జీవీఎస్ అశోక్‌కుమార్ స్టేషన్ అధికారులకు సూచించారు. పోలీస్‌స్టేషన్ల వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌లో నిందితులను ఉంచే సెల్స్, వారికి అవసరమైన సౌకర్యాలు, పరిష్కరించిన, ఇంకా పరిష్కరించవలసిన ఫిర్యాదులు, వివిధ కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, రావులపాలెం టౌన్ సీఐ జేమ్స్ రత్నప్రసాద్, కొత్తపేట ఎస్ఐ జి.సురేంద్ర, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

అగ్ని ప్రమాద బాధిత బాలికకు రూ.20 వేల సాయం



బాలికకు సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: అగ్ని ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయి గాయపడిన బాలికకు స్థానిక కాశీఅన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు శుక్రవారం రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం వీకర్స్ కాలనీకి చెందిన బోడపాటి నీలిమ (14), కొన్ని రోజుల క్రితం అగ్నిప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయింది. ఆ ప్రమాదంలో తీవ్రమైన గాయాలతో ప్రాణాలతో బయటపడింది. పూర్తిగా కోలుకోవడానికి రెండేళ్ల వరకూ వైద్యం అందించాల్సి ఉంది. తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మిగిలిన అమ్మాయిని చూసే వాళ్లు ఎవరూ లేని పరిస్థితి. దీంతో స్థానికులు వైద్యం కోసం సాయం కోరడంతో కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు తాడేపల్లిగూడెం వెళ్లి రూ.20 వేలు సాయం అందజేసినట్టు సభ్యులు తెలిపారు.

25న డిగ్రీ కాలేజీలో జాబ్ మేళా

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 25న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ప్రముఖ హెచ్‌సీఎల్ టెక్ కంపెనీలో అసోసియేట్‌గా ఉద్యోగం కోసం ఆసక్తి గల అభ్యర్థులు 25న కళాశాల జేకేసీ కోఆర్డినేటర్ కె.రజని ఆధ్వర్యంలో జరిగే జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. ఇంటర్మీడియెట్ 75 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన సీఈసీ, హెచ్ఈసీ, బైపీసీ, ఒకేషనల్ గ్రూపుల అభ్యర్థులను ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ టెన్త్ క్లాస్, ఇంటర్మీడియెట్, ఆధార్ కార్డ్ సర్టిఫికెట్లతో ఉదయం 11 గంటలకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

అన్ని వర్గాల అభివృద్ధికి కృషి

అయినవిల్లి: అన్ని వర్గాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, ఎంపీ జి.హరీష్‌మాథుర్ అన్నారు. శుక్రవారం నేదునూరులో 'ఇదీ మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామంలో రహదారుల నిర్మాణం కోసం రూ.33 లక్షలు మంజూరు చేశామన్నారు. 124 మందికి కొత్తగా పింఛన్లు అందజేసినట్లు తెలిపారు. ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్యు, తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ, సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, ఎంపీటీసీలు కళ్లేపల్లి సుబ్బరాజు, ఇందుగుల వెంకట్రామయ్య, నాయకులు పాల్గొన్నారు.

రాజమన్నార్ సేవలు చిరస్మరణీయం



రాజమన్నార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న స్టాలిన్‌బాబు

అంబాజీపేట: స్థానిక కొబ్బరి పరిశోధన కేంద్రానికి ఖ్యాతిని తీసుకువచ్చేందుకు, కొబ్బరి ఉత్పత్తులను పెంపొందించేందుకు తన పరిశోధనల ద్వారా కృషి చేసిన వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.రాజమన్నార్ సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నేలపూడి స్టాలిన్‌బాబు అన్నారు. అంబాజీపేటలో రాజమన్నార్ సంస్మరణ సభలో స్టాలిన్‌బాబు పాల్గొన్నారు. కొబ్బరి మొక్కల పెథాలజీ విభాగంలో ఎన్నో పరిశోధనలు చేసి రైతులకు వివరించారు. శాస్త్రవేత్త మొక్కలకు ఆశించే తెగుళ్ల నివారణకు రాజమన్నార్ చేసిన కృషి మరువలేమన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం రాజమన్నార్ కుమారుడు ప్రభాకర్‌ను, కుటుంబ సభ్యులను ఓదార్చారు.

జీఓ 117ను రద్దు చేయాలి

మామిడికుదురు: ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసిన జీఓ 117ని రద్దు చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.సురేష్‌బాబు డిమాండ్ చేశారు. పాశర్లపూడి, మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలల వద్ద శుక్రవారం పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండల శాఖ అధ్యక్షుడు వై.పల్లంరాజు ప్రారంభించారు. రెండేళ్ల నుంచి నిలిపి వేసిన పాఠశాల గ్రాంట్లను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సీహెచ్.ప్రదీప్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శులు కె.చంద్రశేఖర్, పి.బ్రహ్మాజీరావు, మండల ప్రధాన కార్యదర్శి సీహెచ్ రమేష్, కోశాధికారి కేవీడీ ప్రసాద్, సీహెచ్ వెంకటేశ్వరరావు, వి.సాయిబాబు, ఎల్.శ్రీమన్నారాయణ, సీహెచ్ నిరంజని పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలి



అంబాజీపేటలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న సుబ్రహ్మణ్యం

అంబాజీపేట: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చదువుకుంటే మంచి మార్కులు తెచ్చుకుంటారని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సమగ్ర శిక్షా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి బీవీవీ సుబ్రహ్మణ్యం అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మానసిక ప్రశాంతతో చదువుకోవడం వల్ల ఫలితాలు ఉంటాయన్నారు. ప్రతి సబ్జెక్టును కష్టపడి, ఇష్టంగా చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. జిల్లాలో 22 మండలాల ఎంఈఓల నుంచి తరలించిన షూ సైజు సరపడని జతలను స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో భద్రపరుస్తున్నామన్నారు. విద్యార్థులు ఇచ్చిన సైజు, ఇండెంట్‌ల ప్రకారం త్వరలో అన్ని మండలాల పాఠశాలలకు టైలను పంపిణీ చేస్తామన్నారు. విద్యార్థులకు అందజేసిన యూనిఫాం, టై, బెల్ట్, షూలతో రోజూ పాఠశాలకు హాజరు కావాలన్నారు. అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో పౌష్టికాహారంతో కూడిన భోజనాన్ని అందిస్తున్నారని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. మెనూ ప్రకారం రుచికరమైన వంటకాలను తయారు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు వడ్డించి వారితో కలసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కడలి సాయిరామ్, స్టాఫ్ సెక్రటరీ వెన్నపు సత్యనారాయణ, సీఆర్పీలు పాల్గొన్నారు.

డీ వార్మింగ్ డే లక్ష్యం పూర్తి

ఆలమూరు: మండలంలోని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల పరిధిలో శుక్రవారం నిర్వహించిన డీ వార్మింగ్ డే లక్ష్యం పూర్తయ్యింది. ఆయా పీహెచ్‌సీల్లో వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి ఆధ్వర్యంలో ఈనెల 17న 97.6 శాతం మందికి మాత్రలను అందించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మిగిలిన వారికి శుక్రవారం ఆల్బెండజోల్ మాత్రలను మధ్యాహ్న భోజన సమయంలో చిన్నారులు, విద్యార్థులకు అందజేశారు.

నేడు హుండీల ఆదాయం లెక్కింపు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వర స్వామివారి హుండీల ఆదాయాన్ని శనివారం లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణ రాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. చవితి మహోత్సవాల్లో స్వామివారికి వచ్చిన హుండీల ఆదాయాన్ని లెక్కిస్తామన్నారు. ఈ కార్యక్రమం ఆలయ తనిఖీదారు, గ్రామస్తుల ఆధ్వర్యంలో జరుగుతుందని వివరించారు.

భారీ వర్షం



అంబాజీపేట ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపునీరు

అంబాజీపేట: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా అంబాజీపేట మండలంలో శుక్రవారం సాయంత్రం సుమారు గంట పాటు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. పాఠశాలల నుంచి ఇళ్లకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత వారం రోజులు సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తూ వేసవిని తలపించేలా ఎండలు కాయడంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. శుక్రవారం కురిసిన భారీ వర్షానికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడంతో ప్రజలు ఉపశమనం పొందారు. వాతావరణ మార్పుల కారణంగా రోగాల బారిన పడే అవకాశాలున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అయినవిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాల్లోని కాలనీల్లో వర్షపునీరు చేరింది. రోడ్లపై వర్షపు నీరు పొంగి పొర్లింది. వర్షం నీరు కురుస్తున్నంత సేపు రహదారులపై వాహనాలు నిలిచిపోయాయి. వర్షంతో వాహనాల అద్దాలపైకి వర్షపునీరు చేరి కనిపించకపోవడంతో వాహనాలను డ్రైవర్లు నిలిపివేశారు.

అన్ని రంగాల్లో అభివృద్ధే లక్ష్యం

కొత్తపేట: గ్రామ స్థాయి నుంచి దేశం అన్ని రంగాల్లో అభివృద్ధే 'వికసిత్ ఆంధ్ర–2047 విజన్ ప్లాన్' లక్ష్యమని ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ అన్నారు. 'వికసిత్ ఆంధ్ర 2047 విజన్ ప్లాన్' అంశాలపై పాఠశాల స్థాయిలో ప్రథమస్థానం పొందిన విద్యార్థులకు స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. ఎంఈఓ ఎం.హరిప్రసాద్ పర్యవేక్షణలో స్థానిక పాఠశాల హెచ్ఎం ఆర్.రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రతి అంశంలో 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మండల స్థాయిలో వ్యాసరచనలో వానపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పిల్లి లక్ష్మీప్రణవ్య, వక్తృత్వంలో కొమ్ముల మణికంఠ ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా మండలంలోని వివిధ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు వ్యవహరించారు. మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఈఓలు తెలిపారు.

ముమ్మరంగా బీజేపీ సభ్యత్వ నమోదు

అయినవిల్లి: మండలంలోని బీజేపీ సభ్యత్వ నమోదు ముమ్మరంగా చేపట్టినట్టు పి.గన్నవరం నియోజకవర్గ కన్వీనర్ చీకురుమెల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం అయినవిల్లిలో సభ్యత్వ ప్రముఖ్, శక్తి కేంద్ర ప్రముఖులతో కలసి సభ్యత్వ నమోదు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అయినవిల్లి మండల సభ్యత ప్రముఖ్ కొప్పనాతి శ్రీరామచంద్రమూర్తి, యనమదల వెంకటరమణ, శక్తి కేంద్ర ప్రముఖులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

కొత్తపేట: ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులను దూరం చేయాలని అవిడి, వానపల్లి పీహెచ్‌సీల సిబ్బంది ప్రజలకు సూచించారు. శుక్రవారం గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలు నిర్వహించారు. దానిలో భాగంగా అవిడి పీహెచ్‌సీ సబ్ యూనిట్ ఆఫీసర్ రాజబాబు, హెల్త్ అసిస్టెంట్ వాడ సద్గుణరావు ఆధ్వర్యంలో సిబ్బంది, ఆశ కార్యకర్తలు స్థానిక కమ్మిరెడ్డిపాలెం, రెవెన్యూ కాలనీ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి అనారోగ్య వాతావరణానికి కారణాలను చూపి, వాటి నివారణకు తీసుకోవలసిన చర్యలు తద్వారా ఆరోగ్య వాతావరణం గురించి వివరించారు. దోమల వృద్ధికి దోహదపడే వస్తువులను తొలగించారు. డ్రైన్లు, మురికి కాలువల్లో దోమలు నివారణ మందు చల్లారు.

'స్వచ్ఛతాహి సేవ'పై అవగాహన

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెంలో ఓఎన్జీసీ సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవపై శుక్రవారం అవగాహన కల్పించారు. స్థానిక సర్పంచ్ సలాది బుచ్చిరాజు సమక్షంలో స్వచ్ఛతాహి సేవ–2024పై ఓఎన్జీసీ జనరల్ మేనేజర్ రామచంద్రన్ అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామస్తుల ఆధ్వర్యంలో కళాజాత, ర్యాలీ నిర్వహించారు.

ఆలమూరులో..

ఆలమూరు: గ్రామాల్లో పరిశుభ్రత కోసం పాటుపడటం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజల సంపూర్ణ ఆరోగ్యానికి కృషి చేద్దామని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు కొనియాడారు. స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని 18 గ్రామాల్లో ఆయా గ్రామ సర్పంచుల అధ్యక్షతన స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామ సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో భారీ ర్యాలీలు నిర్వహించారు. పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ ప్రతిజ్ఞ చేయడంతో పాటు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు గ్రామ పరిసర ప్రాంతాల్లో మొక్కలను నాటారు.

పౌష్టికాహారంతో మెరుగైన సమాజం



సీమంతం కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, దాతలు

అంబాజీపేట: మెరుగైన సమాజ నిర్మాణానికి పోషకాహారం ముఖ్యమని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి అన్నారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెం కాపు సామాజిక భవనంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎస్.వెర్రినమ్మ, వీఎస్‌వీ మహాలక్ష్మిల ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఎంపీపీ వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ వరలక్ష్మి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామన్నారు. రక్తహీనతను అరికట్టేందుకు పౌష్టికాహారమైన ఆకుకూరలతోనే సాధ్యమవుతుందన్నారు. అనంతరం స్థానిక నాయకుడు మైపాల తాతాజీ, పద్మావతి దంపతులు సమకూర్చిన పసుపు, కుంకుమ, స్వీట్లు, పూలు, సీమంతం కిట్లను 10 మంది గర్భిణులకు, అన్నప్రాశన కార్యక్రమానికి హాజరైన వారికి పంపిణీ చేశారు. సర్పంచ్ ఎస్.శాంతకుమారి, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ఎం.ప్రకాంత్, వైస్ ఎంపీపీ ఎస్.నాగరాజు, ఎంపీటీసీ ఎం.పార్వతి, తహసీల్దార్ జె.వెంకటేశ్వరి, ఆర్ఐ ఎండీ ఇబ్రహీం, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎనిమిది మంది ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన ముంగండ విద్యార్థులు

పి.గన్నవరం: ముంగండ జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ఎనిమిది మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి అండర్–19 సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపిక అయ్యారని పాఠశాల హెచ్ఎం గోకరకొండ కనకదుర్గ తెలిపారు. రామచంద్రాపురంలో ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన సాఫ్ట్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబరచడంతో వీరిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసారని ఆమె వివరించారు. సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైన మట్టపర్తి లాస్యశ్రీ, మట్టపర్తి భాగ్యశ్రీ, మట్టపర్తి మాధవి, తొత్తరమూడి సీతారత్నం, తెలగారెడ్డి త్రిషలక్ష్మి, చిట్టూరి సారూన్‌రోజ, పాలూరి శ్రీరామ వంశీ, మొల్లేటి హర్షవర్ధన్‌లను పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ భావన శ్రీను, వాసు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

సఖినేటిపల్లి: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శుక్రవారం మోరిపోడు పంచాయతీ వద్ద సర్పంచ్ ముప్పర్తి అలివేలు గంగా త్రివేణి అధ్యక్షతన కూటమి ప్రభుత్వం ఏర్పాటై వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే వరప్రసాద్ 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను పూర్తి చేసే పనిలో ఉందన్నారు. ఎంపీటీసీ బళ్ల సుభాషిణి, ప్రత్యేక అధికారి డి.రాంబాబు, ఎంపీడీవో పీవీ సత్యనారాయణ, ఎంఈవో–1 డి.కిషోర్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

పదో రోజుకు చేరిన రిలే దీక్షలు

మలికిపురం: స్థానిక కాలేజీ కూడలిలో డిగ్రీ కాలేజీ అధ్యాపకులు చేస్తున్న నిరసన రిలే నిరాహార దీక్ష శుక్రవారం పదో రోజుకి చేరుకుంది. యాజమాన్యం మొండి వైఖరిని ఖండిస్తూ అధ్యాపకులు చెవిలో పువ్వులు పెట్టుకుని వినూత్నంగా తమ నిరసనను తెలియచేశారు. శిబిరాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే కె.చిట్టిబాబు మాట్లాడుతూ అధ్యాపకులని రోడ్డు కీడ్చిన యాజమాన్య దుశ్చర్యను ఖండిస్తూ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పలువురు విశ్రాంత అధ్యాపకులు, నాయకులు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.

సభ్యత్వాలు నమోదు చేయించాలి

పి.గన్నవరం: జిల్లాలో అధిక సంఖ్యలో బీజేపీ సభ్యత్వాలను నమోదు చేయించాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా అన్నారు. మండలంలోని మొండెపులంకలో శుక్రవారం బీజేపీ సభ్యత్వ నమోదుని ఆయన ప్రారంభించారు. మండల శాఖ అధ్యక్షుడు యర్రంశెట్టి సాయిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వేమా మాట్లాడారు. ప్రధాని మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని వివరించారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పూర్వ వైభవానికి కృషి చేస్తా..

మలికిపురం: రాజోలు నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం శుక్రవారం లక్కవరంలో రుద్రరాజు గోపాలకృష్ణంరాజు అధ్యక్షతన జిల్లా కాంగ్రెస్ నూతన అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని నాయకులు, కార్యకర్తలు అందరూ కలసికట్టుగా పనిచేసి పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేలా కృషి చేస్తానన్నారు. దీనికి మీ అందరి సహకారం కావాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ సభ్యులు పాల్గొన్నారు.